క్లుప్తంగా

విద్యుత్ శాఖ ఎస్ఈగా కృష్ణనాయక్



ఉయ్యూరు: విద్యుత్ శాఖ ఉయ్యూరు ఈఈగా పనిచేస్తున్న డి.కృష్ణనాయక్‌కు ఎస్ఈగా పదోన్నతి లభించింది. ఈ మేరకు విద్యుత్ శాఖ నుంచి ఉత్తర్వులు అందుకున్న కృష్ణనాయక్‌ను ఉయ్యూరు సబ్‌స్టేషన్ పరిధిలోని సిబ్బంది గురువారం ఘనంగా సత్కరించారు. డీఈ హేమకుమార్, ఏఈ బసవశాస్త్రులు, లైన్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, సిబ్బంది రాజులపాటి జగదీష్, తలకటూరి విజయరాజు, ఆంజనేయులు, రత్నాకర్‌రావు, సురేష్, కుమార్, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉయ్యూరు డివిజన్ పరిధిలో కృష్ణనాయక్ సేవలను కొనియాడారు.

నేటి నుంచి ధనేకుల కాలేజీలో జాతీయ సదస్సు



పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 19, 20 తేదీల్లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని కాలేజీ అకడమిక్ డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి తెలిపారు. గురువారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఇన్నోవేటివ్ ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై సదస్సు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై చర్చ జరిపి అవగాహన కల్పిస్తామన్నారు. సదస్సులో 700 పరిశోధన పత్రాలు రాగా వాటిలో 306 సదస్సుకు ఆమోదించామని చెప్పారు. ఈ పరిశోధన పత్రాలపై అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు చర్చిస్తారన్నారు. వివిధ సంస్థల నుంచి ప్రొఫెసర్లు, నిపుణులు పాల్గొంటారని తెలిపారు.

ఎట్టకేలకు ఫ్లడ్‌లైట్ల స్తంభానికి మరమ్మతులు



గన్నవరం: స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో జాతీయ రహదారి సెంట్రల్ డివైడర్‌పై ఒక పక్కకు ఒరిగిన ఫ్లడ్‌లైట్ల స్తంభానికి ఎన్‌హెచ్ అధికారులు ఎట్టకేలకు మరమ్మతులు చేశారు. ఇటీవల జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో భారీ వాహనం ఢీకొని ఫ్లడ్‌లైట్ల స్తంభం కొంత ఒరిగింది. దీంతో ఎన్‌హెచ్ఏఐ పీడీ విద్యాసాగర్, హైవే ఇంజినీర్ నాగేశ్వరరావు పర్యవేక్షణలో గురువారం మరమ్మతులు చేపట్టారు. రెండు భారీ క్రేనుల సాయంతో స్తంభాన్ని యథాస్థితికి తీసుకువచ్చారు.

కుంగ్ ఫూ, కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నున్న(విజయవాడరూరల్): ఈ నెల 14వ తేదీన ముంబై భీమండి నగరంలో బ్రేవ్ యూత్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన 7వ జాతీయస్థాయి కుంగ్‌ఫూ అండ్ కరాటే టోర్నమెంట్‌లో నున్న గ్రామంలోని రేడియంట్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించారు. గురువారం స్కూల్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అవుతు మధుసూదన్‌రెడ్డి, కరస్పాండెంట్ అవుతు అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ ఎస్తేరు, ప్రైమరీ ఇన్‌చార్జి నూర్జహాన్ గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. నున్న గ్రామం నుంచి ప్రథమంగా స్కూల్ విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో పాల్గొని నేషనల్ టోర్నమెంట్‌కు సెలెక్ట్ కావడం, గెలుపొందడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని బహుమతులు గెలుపొందాలని ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి ఆకాంక్షించారు.

దసరా సెలవులను సక్రమంగా అమలు చేయాలి

గన్నవరం: విద్యా సంస్థలు దసరా సెలవులను సక్రమంగా అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఏపీఎస్ఎఫ్ నేతలు విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ కమలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి చిల్లర రాజేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన దసరా సెలవుల కాలంలో పాఠశాలలు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ తరగతులు నిర్వహించకుండా చూడాలని కోరారు. పదో తరగతి విద్యార్థులపై సెలవుల్లో బలవంతపు తరగతుల భారం పడకుండా దృష్టి సారించాలని తెలిపారు. నాయకులు వేములపల్లి గేయధీరజ్, సంజు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల చెరలో ఫుట్‌పాత్‌లు

- హైవే వెంబడి ఫుట్‌పాత్‌లు మాయం
- పలు చోట్ల ధ్వంసం చేసిన వైనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



ఫుట్‌పాత్‌పై భవన నిర్మాణ సామగ్రి



ఫుట్‌పాత్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన ప్రైవేటు ఏటీఎం

పెనమలూరు: ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా ఉండటానికి, పాదచారుల నడక కోసం రోడ్డు పక్కనే ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. అయితే పాలకులే ఫుట్‌ఫాత్‌లు ధ్వంసం చేయగా, పలువురు వ్యాపారులు సైతం ఏకంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకున్నారు. ప్రజల అవసరాలకు అందుబాటులో ఉంచాల్సిన ఫుట్‌పాత్‌లు మాయమైనా నేషనల్ హైవే అధికారులు, తాడిగడప మున్సిపాలిటీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు కనీస చర్యలు తీసుకోక పోవటంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విజయవాడ – మచిలీపట్నం జాతీయ రహదారి బందరు రోడ్డు విస్తరణ గత 14 సంవత్సరాల క్రితం జరిగింది. సిద్ధార్థ కాలేజీ నుంచి కేసీపీ కాలనీ వరకు జాతీయ రహదారి ఇరువైపులా ప్రజల అవసరాల కోసం ఫుట్‌పాత్‌లు నిర్మించారు. ఈ ప్రాంతంలో సామాన్య ప్రజలతో పాటు విద్యార్థులు రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ఫుట్‌పాత్‌ల అవసరం చాలా ఉంది.

ఫుట్‌పాత్ ధ్వంసం

కేసీపీ కాలనీ ఎదురుగా ఎన్‌హెచ్ఐ స్థలంలో ప్రైవేటు రైతుబజార్ పెట్టారు. వాస్తవానికి ఈ స్థలంలో సర్వీస్ రోడ్డు నిర్మాణం ప్రతిపాదనలో ఉంది. కూటమి నేతలు కూరగాయల దందా కోసం ఎన్‌హెచ్ఐ స్థలం ఆక్రమించి ప్రైవేటు రైతుబజార్ పెట్టి దోపిడీ కొనసాగిస్తున్నారు. అయితే అక్కడే ఉన్న ఫుట్‌పాత్‌లు వ్యాపార దందాకు అడ్డుగా ఉన్నాయని ఫుట్‌పాత్‌లను పూర్తిగా ధ్వంసం చేశారు. ఫుట్‌పాత్ లేకుండా మాయం చేశారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ధ్వంసం చేసినా ఎన్‌హెచ్ఐ, తాడిగడప మున్సిపాలిటీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నారు.

ఫుట్‌పాత్‌లు ఆక్రమించిన వ్యాపారులు

ఈ ప్రాంతంలో వ్యాపారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. షాపుల ఎదుట ఉన్న ఫుట్‌పాత్‌లు పూర్తిగా ఆక్రమించారు. ఫుట్‌పాత్‌లపై ర్యాంపులు నిర్మించారు. కొందరు వ్యాపారులు ఫుట్‌పాత్‌లను షాపులకు దారిగా మార్చుకున్నారు. మటన్ షాపులు, పండ్ల షాపులు, ఏటీఎం కౌంటర్, సోడా బండ్లు, చిల్లర కొట్లు ఇలా అనేక మంది వ్యాపారులు ఫుట్‌పాత్‌లు ఆక్రమించారు. పాదచారులు నడిచి వెళ్లలేని పరిస్థితి నెలకొంది.



రైతుబజార్ వద్ద ధ్వంసం చేసిన ఫుట్‌పాత్

ఫుట్‌పాత్‌పైనే భవన నిర్మాణ సామగ్రి

ఈ ప్రాంతంలో జరుగుతున్న భవన నిర్మాణ మెటీరియల్ కూడా ఫుట్‌పాత్‌పైనే ఉంచుతున్నారు. మట్టి, ఇటుకలు, ఐరన్ రాడ్లు, వాహనాలు ఇలా పలు రకాల మెటీరియల్ ఫుట్‌పాత్‌పై నెలల కొద్ది ఉంచుతున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన ట్రాఫిక్ పోలీసులు సైతం కన్నెత్తి చూడటం లేదు.

ప్రజల ఆందోళన

ఫుట్‌పాత్‌లు పూర్తిగా ఆక్రమణలు జరగటమే కాకుండా పలు ప్రాంతాల్లో ధ్వంసం కావటంతో పాదచారులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. బందరు రోడ్డుపై విపరీతంగా ట్రాఫిక్ పెరిగిందని ఫుట్‌పాత్‌లు లేక పోతే ప్రమాదాల బారిన పడతామని స్థానికులు వాపోతున్నారు. పోలీసులు, అధికారులు ఫుట్‌పాత్‌లను ప్రజలకు ఎందుకు అందుబాటులో ఉంచటం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను తొలగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు.

నేటి 'చలో మచిలీపట్నం' విజయవంతం చేయండి



కంకిపాడు: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేయటాన్ని నిరసిస్తూ శుక్రవారం చేపట్టిన చలో మచిలీపట్నం మెడికల్‌కాలేజ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. వైద్య విద్యను పేద, మధ్యతరగతి వర్గాలకు అందకుండా చేసేందుకు మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలని కుట్రపన్నుతోందన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలోని పార్టీ శ్రేణులు కానూరులోని పార్టీ కార్యాలయం నుంచి, పెనమలూరు, కంకిపాడు మండలాలకు చెందిన శ్రేణులు దావులూరు టోల్‌గేట్ వద్ద నుంచి ఉయ్యూరు, ఉయ్యూరు పట్టణానికి చెందిన శ్రేణులు బైపాస్ రోడ్డులోని టీటీడీ కల్యాణ మండపం వద్ద నుంచి బయలుదేరి మచిలీపట్నం తరలి రావాలని విజ్ఞప్తి చేశారు.

పేరంటాలమ్మ హుండీ ఆదాయం రూ.5.66 లక్షలు

రామవరప్పాడు: స్థానిక శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయ హుండీ కానుకల ఆదాయం రూ.5,66,709 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సృజన్ కుమార్ పర్యవేక్షణలో గురువారం హుండీలను లెక్కించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ.. మూడు నెలల కాలానికి ఈ ఆదాయం వచ్చిందన్నారు. ఉప సర్పంచ్ అద్దెపల్లి సాంబశివ నాగరాజు, మత్తె రాధా కుమార్, పట్టపు చంటి, సాయి సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

కానూరులో వాటర్ ప్లాంట్‌ల తనిఖీ



కానూరులో వాటర్ ప్లాంట్ తనిఖీ చేస్తున్న కమిషనర్ నజీర్

పెనమలూరు: కానూరులో వాటర్ ప్లాంట్‌లను గురువారం తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ షేక్.నజీర్ ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నజీర్ మాట్లాడుతూ కానూరులో 17 వాటర్ ప్లాంట్‌లు ఉన్నాయన్నారు. ఇందులో రెండు వాటర్ ప్లాంట్‌లకు మాత్రమే నాణ్యత ప్రమాణాలకు సంబంధించి అనుమతులు ఉన్నాయని తెలిపారు. వాటర్‌ప్లాంట్‌లకు వివిధ శాఖల నుంచి అనుమతులు, మున్సిపాలిటీ ట్రేడ్ లైసెన్స్, ఇతర అనుమతులు లేనట్లు గుర్తించామన్నారు. అదే విధంగా నీటి నాణ్యతపై తనిఖీలు చేశామన్నారు. వాటర్ ప్లాంట్ నిర్వాహకులు నీటి నాణ్యత ల్యాబ్‌లలో టెస్టులు చేయించి సర్టిఫికెట్ పొందాలని సూచించారు. వారం రోజుల్లో వాటర్‌ప్లాంట్ యజమానులు అన్ని అనుమతులు తీసుకోవాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి పెట్టాలి



కృష్ణ దొరను సన్మానిస్తున్న ప్రొఫెసర్లు

పెనమలూరు: మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు దృష్టి పెట్టి ఉత్తమ ఫలితాలు సాధించాలని హైదరాబాద్‌కు చెందిన ఎక్స్‌డిలిక్స్ ల్యాబ్ ఎండీ డాక్టర్ కృష్ణదొర అన్నారు. కానూరు సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో గురువారం మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ప్రారంభమైన రెండు రోజుల వర్క్‌షాపు రోబో ఎక్స్ 2కె25లో ఆయన పాల్గొని ప్రసంగించారు. నేడు పరిశ్రమల భవిష్యత్తుకు రోబోటిక్స్, ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్, స్మార్ట్ ఆటోమేషన్ చాలా ప్రాధాన్యత ఉందన్నారు. సమాజాన్ని ప్రభావితం చేసే విధంగా ఇంజినీరింగ్ విద్యార్థులు కృషి చేయాలని తెలిపారు. ఉపకులపతి డాక్టర్ పి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా 400 మంది విద్యార్థులు రోబో ఎక్స్ 2కె25లో పాల్గొన్నారన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యం వెలికితీయటానికి వివిధ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు రూ .2 లక్షల బహుమతులు అందజేస్తామన్నారు. ప్రో ఉపకులపతి రత్నప్రసాద్, డైరెక్టర్ బి.పాండురంగారావు, రిజిస్ట్రార్ రవిచంద్, డీన్ వెంకటరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్సీ ఇవ్వాలని మున్సిపల్ కార్మికుల ధర్నా



పోరంకిలో ధర్నా చేస్తున్న కార్మికులు

పెనమలూరు: ప్రభుత్వం తమకు వెంటనే పీఆర్సీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మున్సిపాలిటీ ఉద్యోగులు, కార్మికులు గురువారం పోరంకి మున్సిపాలిటీ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఉద్యోగులు, కార్మిక సంఘ జిల్లా నాయకుడు షేక్.కాశిం మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపాలిటీ ఉద్యోగులు, కార్మికుల వేల సంఖ్యలో ఉన్నారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం 11 పీఆర్సీ ముగిసి రెండేళ్లు కావొస్తున్నా నేటికి పీఆర్సీ ఇవ్వకుండా జాప్యం చేస్తోందని ఆరోపించారు. తాడిగడప మున్సిపాలిటీలో గతంలో కార్మికులు చేసిన సమ్మె కాలానికి జీతాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 60 ఏళ్లు దాటిన కార్మికుల కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. కార్మికులకు పని చేయటానికి పరికరాలు, యూనిఫాం, నూనె ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ సంఘం నాయకులు వై.సరళ, రత్నకరణ, కార్మికులు పాల్గొన్నారు.

106 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదానం చేస్తున్న ఉషారామ విద్యార్థులు

తేలప్రోలు(గన్నవరం): ఉంగుటూరు మండలం తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం అమెరికన్ బ్లడ్ క్యాన్సర్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ రక్తదాన శిబిరం నిర్వహించింది. తొలుత ఈ శిబిరాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకేఎస్‌వీ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న వారికి ప్రాణదానం చేయవచ్చన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ వి.శ్రీహరిబాబు మాట్లాడుతూ.. ఈ శిబిరంలో 106 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేశారన్నారు. వైద్యాధికారి డాక్టర్ మురళీమోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి వికాస్‌లో అంతర్జాతీయ సదస్సు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న సెక్రటరీ సత్యనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు

విజయవాడరూరల్: నున్నలోని వికాస్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో ఇంజినీరింగ్, ఫార్మసీ అండ్ లైఫ్ సైన్సెస్‌లో తొలి అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు వికాస్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎన్.సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎస్ శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో అంతర్జాతీయ సదస్సు బ్రోచర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విట్- ఏపీ ప్రొఫెసర్ డాక్టర్ అనిల్ విఠల్‌రావు, నిట్-వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ అంబా ప్రసాద్ సదస్సులో పాల్గొని ముఖ్య ఉపన్యాసం చేస్తారన్నారు. సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఇతర రాష్ట్రాలతో పాటు అమెరికా సంయుక్త రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, ప్రొఫెసర్లు తమ పరిశోధనా పత్రాలను సమర్పిస్తారన్నారు. నిపుణులు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు ఈ రంగాల్లో అత్యాధునిక పురోగతిని పంచుకుంటారని పేర్కొన్నారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వీఎల్ఎన్ ఫణి పొన్నపల్లి, సహ కన్వీనర్లు టి.కిషోర్‌రెడ్డి, జి.శేఖర్‌రెడ్డి, డాక్టర్ సీహెచ్ కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

సాలిడ్ వర్క్స్‌లో శిక్షణ

నున్న(విజయవాడరూరల్): వికాస్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం విద్యార్థులకు సాలిడ్ వర్క్స్ శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఫర్ టూల్ డిజైన్ విజయవాడ శాఖ నుంచి సుల్తాన్ కబీర్ షా, కళ్యాణ్ పాల్గొని విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు, మెకానికల్ విభాగాధిపతి మస్తానయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సామూహిక ఎలుకల నివారణ మందుల పంపిణీ

గన్నవరం: ఉంగుటూరు మండలం పొణుకుమాడు గ్రామంలో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.పద్మావతి చేతుల మీదుగా రైతులకు రాయితీపై బ్రోమోడయోలోన్ ఎలుకల నివారణ మందులు పంపిణీ చేశారు. కమిషనరేట్ జేడీఏ ఎం.పద్మావతి, మండల వ్యవసాయ అధికారి జి.రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు సుంకర రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనతో పంట సంరక్షణ

కంకిపాడు: సామూహిక ఎలుకల నిర్మూలనతోనే పంటల సంరక్షణ సాధ్యమని మండల వ్యవసాయాధికారి వెలివెల ఉషారాణి బాబూరావు అన్నారు. మండలంలోని దావులూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. రైతులకు సాగులో మెలకువలను వివరించారు. స్థానిక రైతులు, వ్యవసాయ సహాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రమైన తాగునీటితో రోగాలు దూరం



గన్నవరంరూరల్: పరిశుభ్రమైన తాగునీటితో రోగాలు దూరమవుతాయని వీరపనేనిగూడెం సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ పేర్కొన్నారు. స్థానిక సచివాలయంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో క్లోరినేషన్‌పై గురువారం చర్చించారు. ట్యాంకుల ద్వారా గ్రామానికి సరఫరా అవుతున్న తాగునీటి ట్యాంకులను తరచూ శుభ్రం చేయించాలని సూచించారు. నిర్ణీత సమయంలో మరలా కడిగేందుకు రికార్డులు మెయింటెన్ చేయాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ.. తాగునీరు కాచి చల్లార్చి తాగితే వ్యాధులు దరి చేరవన్నారు. ప్రతి కుటుంబం రక్షిత తాగునీటిని తీసుకోవాలని చెప్పారు. ఈ మేరకు గ్రామస్తులకు సిబ్బంది అవగాహన కల్పించాలన్నారు. వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని భారత ఆహార సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పంచకర్ల రమేష్ చక్రవర్తి ప్రారంభించారు. శిబిరంలో మెడివ్యాలీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్‌కు చెందిన వైద్యులు సుధా, స్పందన వైద్య సేవలందించారు. బీపీ, షుగర్, ఈఎన్‌టీ, దంత సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎఫ్‌సీఐ మేనేజర్లు శ్యామ్ ప్రసాద్, మల్లికార్జునరావు, లయన్స్‌క్లబ్ సీనియర్ సభ్యులు నందిగం వెంకటేశ్వరరావు, మాకినేని శ్రీనివాసరావు, మత్తి సాంబశివరావు, అక్కినేని రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

కోడూరుపాడు ఎంపీపీ స్కూల్‌కు సొంత భవనం నిర్మించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న శ్రీనివాసరావు, గ్రామస్తులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కోడూరుపాడులోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సొంత భవనాన్ని ఏర్పాటు చేయాలని వైఎస్సార్ సీపీ నేత చందు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రస్తుతం అద్దె భవనంలో కొనసాగుతున్న పాఠశాల ఎదుట శ్రీనివాసరావు నేతృత్వంలో గ్రామస్తులు గురువారం ఆందోళన నిర్వహించారు. ఇప్పటికే విద్యా శాఖ, రెవిన్యూ శాఖ ఉన్నతాధికారులను పలుమార్లు కలిసి వినతిపత్రాలను అందించినప్పటికీ ఫలితం లేదని ఆయన వాపోయారు. ప్రస్తుతం ఆర్సీఎం సంస్థకు చెందిన భవనంలో నిర్వహిస్తున్న ఎంపీపీ స్కూల్‌ను తరలించాలని ఆ సంస్థ ప్రతినిధులు ఒత్తిడి పెట్టడంతో దిక్కుతోచని స్థితి ఏర్పడిందని వాపోయారు. తక్షణమే అధికారులు, ప్రజా ప్రతినిధులు దీనిపై స్పందించి, పాఠశాలకు సొంత భవనాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

స్థూలకాయ సమస్యలపై అవగాహన అవసరం



పోషక ఆహార స్టాల్‌ను పరిశీలిస్తున్న సీడీపీఓ మంగమ్మ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థూలకాయంతో మనిషికి అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని, జీవిత కాలం తగ్గిపోతుందని ఐసీడీఎస్ వీరవల్లి సెక్టార్ సూపర్‌వైజర్ ఝాన్సీరాణి అన్నారు. బాపులపాడు మండలం ఎ.సీతారామపురంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 8వ రాష్ట్రీయ పోషణ మాసాన్ని పురస్కరించుకుని ఊబకాయంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. చక్కెర, నూనె కలిగిన ఆహార పదార్థాలు, ఫాస్ట్‌ఫుడ్స్ వినియోగం తగ్గించటం వల్ల ఊబకాయాన్ని నియంత్రించవచ్చని చెప్పారు. అధికంగా మానసిక ఒత్తిడికి లోనుకావటం వల్ల కూడా స్థూలకాయ సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్త కె.భానుమతి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

చక్కెర, నూనె వినియోగం తగ్గించాలి..

దావాజిగూడెం(గన్నవరం): దావాజిగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో రాష్ట్రీయ పోషణ మాసోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ జి.మంగమ్మ మాట్లాడుతూ.. పిల్లల్లో స్థూలకాయం నివారణకు చక్కెర, నూనె వినియోగం తగ్గించాలన్నారు. ఇంటి వద్ద లభించే మునగ ఆకు, ఆకుకూరలు, మిల్లెట్స్ ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలన్నారు. పాఠశాల హెచ్ఎం కన్యకుమారి, సీఐడీఎస్ సూపర్‌వైజర్ జె.సత్యవతి, సీహెచ్ఓ జి.పావనిపుష్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక గౌడపేట అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన అవగాహన సదస్సులో సీడీపీఓ మంగమ్మ, సూపర్‌వైజర్ సీహెచ్.నాగపద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఉంగుటూరు మండలం ఆముదాలపల్లిలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పోషక మాసోత్సవం నిర్వహించారు. పిల్లల ఆహారం, ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఎన్ఎం ఎం.శశిరాజకళ వివరించారు. హెచ్ఎం వి.నరసన్నాయుడు, అంగన్‌వాడీ, సచివాయల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ వీఆర్‌ఏల ధర్నా



గన్నవరంలో ధర్నా నిర్వహిస్తున్న వీఆర్‌ఏలు

గన్నవరం: మండలంలోని గ్రామ రెవెన్యూ సహాయకులు(వీఆర్‌ఏ)లు సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన బాటపట్టారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట రెండు రోజుల పాటు జరగనున్న ధర్నాను గురువారం సంఘం జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటరత్నం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన నిత్యావసరాల ధరల దృష్ట్యా అరకొర వేతనాలతో వీఆర్‌ఏలు ఇబ్బందులు పడుతున్నామన్నారు. వీఆర్‌ఏలను నైట్ వాచ్‌మెన్‌లుగా, కంప్యూటర్ ఆపరేటర్లగా పనిచేయిస్తూ అదనపు భారాన్ని విధిస్తున్నారని చెప్పారు. ఇప్పటికైనా వీఆర్‌ఏలకు పేస్కేల్‌ను అమలు చేయడంతో పాటు నామినీలుగా పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతి కల్పించాలని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు మిరంపల్లి పూర్ణచంద్రరావు, ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, కోశాధికారి డి.అనూష, సభ్యులు సుజాత, గీత, స్వర్ణ, ఝాన్సీ, సువర్ణ, జ్యోతి, లక్ష్మి, పద్మావతి, సుబ్బారావు, షెహనాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యవంతంగా ఉండాలి



పెనమలూరు: మహిళలు ఆరోగ్యవంతమైన జీవించాలని ఎంఎల్‌హెచ్‌పీ పి.లక్ష్మిసునీత అన్నారు. వణుకూరు గ్రామంలో గురువారం 8వ రాష్ట్రీయ పోషణ మాసం 2025 కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎత్తుకు తగ్గ బరువు ఉండాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త బి.కాశేశ్వరీదేవి, హెల్త్ అసిస్టెంట్ కె.రాము, తల్లులు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

పొట్టిపాడులో సశక్త్ పరివార్

ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం పొట్టిపాడు హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో గురువారం స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎంపీపీ వడ్లమూడి సరోజిని మాట్లాడుతూ...మహిళలు ఆరోగ్యంగా ఉండడం ద్వారానే ఆ కుటుంబాలు శక్తివంతంగా ఉంటాయని చెప్పారు. మహిళలకు సంక్రమించే వ్యాధులు, నివారణ చర్యలను పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.జితేంద్రకుమార్ వివరించారు. గ్రామ సర్పంచ్ కత్తుల జ్యోతి, ఎంపీహెచ్ఈఓ జి.రత్నబాబు, వైద్య సిబ్బంది వి.లక్ష్మీకుమారి, ఆర్.వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.